క్లుప్తంగా

వేలం పాట వాయిదా

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయంలో కొబ్బరి కాయ, పూజ సామగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయించుకునేందుకు గానూ మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించగా పాటదారులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ పర్యవేక్షణాధికారి నల్లమోతు శేషయ్య తెలిపారు. త్వరలో వేలం పాట నిర్వహణ తేదీని వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యాన శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ హుండీని దేవాదాయశాఖ ఖమ్మం విభాగం పరిశీలకుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యాన లెక్కింపు చేపట్టగా రూ.20,722 ఆదాయం వచ్చినట్లు ఈఓ శేషయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, పూజారి పుల్లయ్యశర్మ, మల్లెంపాటి శ్రీనివాసరావు, ప్రభాకర్‌రావు, సత్యమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని జూబ్లీపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన రూ. 13 వేల విలువైన పుస్తకాలు, బిస్కట్లను పంపిణీ చేశారు. దాత లయన్స్ క్లబ్ సభ్యుడు వంగవీటి నవీన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. క్లబ్ అధ్యక్షుడు బొల్లికొండ శ్రీనివాసరావు, ప్రతినిధులు డాక్టర్ డీపీసీ రావు, విశ్వేశ్వరరావు, పాయల నాగేశ్వరరావు, దుర్గా నాగేశ్వరరావు, నవీన్, సుబ్బారావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి పట్ల ఆకర్షితులై బీజేపీలో పలువురు చేరుతున్నట్లు బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని 26వ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వాలను నమోదు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్, రుద్రప్రదీప్, సరస్వతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

పంప్ ఆపరేటర్లకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

రఘునాథపాలెం: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన పంప్ ఆపరేటర్లకు రఘునాథపాలెంలోని రైతు వేదికలో పంచాయతీల్లో మోటార్ల నిర్వహణ, ప్రాథమిక మరమ్మతులు తదితర వాటిపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలత పర్యవేక్షణలో డీఈ, ఏఈ శ్రీనివాసరావు వారికి మోటార్లు బిగించే విధానం, రిపేర్ వచ్చినప్పుడు బోరు నుంచి బయటకు తీసే విధానం, 5 హెచ్‌పీ, 3 హెచ్‌పీల తేడా, స్టార్టర్ మీటరు పని తీరు, వైరు తదితర వాటిపై అవగాహన కల్పించారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

నేలకొండపల్లి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం మార్కెట్ కార్యాలయంలో సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గండు సతీష్, పెద్దపాక సైదులు కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఖమ్మంరూరల్: బీజేపీ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నున్నా రవికుమార్ తెలిపారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ బూత్‌లో 100 మందిని పార్టీలో చేర్పించాలన్నారు. అనంతరం కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడగా.. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు తక్కెళ్లపల్లి నరేంద్రరావు, మేక సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి, వీరభద్రం పాల్గొన్నారు.

కబ్జా భూములను వదిలిపెట్టం..

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మంఅర్బన్: కైకొండాయిగూడెంలో పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంఅర్బన్: ప్రైవేట్ కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కబ్జాకు గురైన దేవాదాయ, రెవెన్యూ తదితర భూములను ప్రభుత్వం తీసుకొని అర్హులైన పేదలకు పంచనున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్‌లో రెండు కోట్ల నిధులతో 12 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి రెండు నెలల్లో పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అలాగే శ్మశానవాటిక నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో కేఆర్ ఫంక్షన్ హాల్ నుంచి స్కూల్ వరకు లింక్ రోడ్డు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఆర్డీఓ జి.గణేష్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ ఈఈలు రంజిత్, పుష్పలత, మున్సిపల్ డీఈ ధరణి, కార్పొరేటర్ ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన..

ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్‌గృహకల్ప, జలగంనగర్ వరద ముంపు ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ద్విచక్ర వాహనంపై పర్యటించారు. ఈమేరకు సందర్భంగా వరద బాధితులను కలిసి ప్రభుత్వం నుంచి అందుతున్న సాయం, పారిశుద్ధ్య పనుల తీరు అడిగి తెలుసుకుని, మున్సిపల్ అధికారులకు పారిశుద్ధ్యం పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, కాంగ్రెస్ నాయకులు బైరు హరినాథబాబు, మద్ది వీరారెడ్డి, చింతమళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ల వినతి..

ఖమ్మంగాంధీచౌక్: తమకు అసిస్టెంట్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించాలని కోరుతూ హౌసింగ్ కార్పొరేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖమ్మం మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. తమకు 5 శాతం మధ్యంతర భృతి అమలు చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ప్రతినిధులు, ఉద్యోగ ప్రతినిధులు వెంకటరామిరెడ్డి, వెంకయ్య, శ్రీనివాసరెడ్డి, ఉమామహేశ్వరరావు, రాంబాబు, కోటేశ్వరరావు, చాట్ల వెంకటేశ్వరరావు, చుంచు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అభినందన..

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన జిల్లాకు చెందిన ఆడపా హారికానాయుడును మంత్రి శ్రీనివాసరెడ్డి మంగళవారం అభినందించారు. తొలుత మంత్రిని క్యాంపు కార్యాలయంలో ఆమె మర్యాదపూర్వకంగా కలిసి, మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

గీత కార్మికులందరికీ రక్షణ కిట్లు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంవన్‌టౌన్: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షక కవచ కిట్లను అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలోని 30వ డివిజన్ పంపింగ్‌వెల్ రోడ్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం తెలంగాణ కల్లు గీత కార్మికుల సహకార ఆర్థిక సంఘం, హైదరాబాద్ శాఖ సహకారంతో 100 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచం భద్రత కిట్లను పంపిణీ చేశారు. ఆతర్వాత నగరంలో ఎక్సైజ్ శాఖ పరిధిలో జరుగుతున్న పనులు మొదలగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల వరద ముంపునకు దెబ్బతిన్న ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిని పరిశీలించి మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కమర్తపు మురళీ, రావూరి సైదుబాబు, తుపాకుల ఎలగొండల స్వామి, మిక్కిలినేని నరేందర్, కొప్పెర ఉపేందర్, గజ్జెల లక్ష్మి, తదితరులు ఉన్నారు. కాగా, నేడు(బుధవారం) 16వ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ రోడ్డు నంబర్ 13లో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

మంత్రికి వినతి..

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని మంగళవారం ఖమ్మంలో మంత్రి తుమ్మలను కళా సాంస్కృతిక రంగాల ప్రతినిధులు వినతి పత్రం అందించారు. దీంతో కళాక్షేత్రం అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కళాపరిషత్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, తదితరులు ఉన్నారు.

పరామర్శ..

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాంను మంత్రి తుమ్మల మంగళవారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు నల్లమల వెంకటేశ్వరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, కర్ణకుమార్, సాంబశివారెడ్డి, శశిధర్ తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డ్‌పై మంత్రులు స్పందించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగర నడిసెంటర్‌లో ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న రాపర్తినగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించడానికి మంత్రులు స్పందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన డంపింగ్ యార్డ్ తరలిస్తామని హామీ ఇచ్చిన మేరకు మంత్రులు చొరవ చూపించాలన్నారు. గత కొన్నేళ్లుగా రాపర్తినగర్, దానవాయిగూడెం ఏరియాల్లోని ప్రజలు దీని ప్రభావంతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, వెంటనే సమస్యకు పరిష్కార మార్గం చూడాలని కోరారు. లేకపోతే అఖిల పక్షం ఆధ్వర్యాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు సీహెచ్. భద్రం, నాగేశ్వరరావు, రమేష్, నాగరాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన పెట్రోలియం డీలర్లు



మంత్రి తుమ్మలకు మొక్క అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఇటీవల వచ్చిన వరదలతో నాయకులగూడెంలో ఎస్ఎస్ఎల్‌వీ ఆటో సర్వీసెస్ (ఐఓసీ పెట్రోల్ బంక్) పూర్తిగా ధ్వంసమైందని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించాలని కోరారు. అలాగే తుమ్మల నాగేశ్వరావును కూడా మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. ఆపై సమస్యను వివరించారు. మంత్రులను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈశ్వరప్రగడ రంగనాథ్, జనరల్ సెక్రటరీ కూరపాటి మంజుల, ట్రెజరర్ వజినేపల్లి శ్రీనివాస రవికుమార్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మోతుకూరి గోపాలరావు, జాయింట్ సెక్రటరీ మద్ది పిచ్చయ్య, దమ్మలపాటి నగేష్, ఈసీ మెంబర్లు, డిస్ట్రిక్ట్ అడ్వైజర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో నగరాన్ని ముందుంచాలి



మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో చెత్త పాయింట్లు లేకుండా వీధులన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లకు మేయర్ పునుకొల్లు నీరజ సూచించారు. కేఎంసీ కార్యాలయంలో మంగళవారం పారిశుద్ధ్యంపై అత్యవసర సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్ని డివిజన్లలో పారిశుద్ధ్యకార్మికుల విధులు, వాహనాల పనితీరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో ఎక్కడ చెత్త కనిపించినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, పరిశుభ్రతలో నగరాన్ని ముందుంచేలా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదవులు కాదు.. స్థలాలు ముఖ్యం



సమావేశంలో పాల్గొన్న టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులు

ఖమ్మంసహకారనగర్: నగర పరిధిలోని జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం నగరంలోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండలరావు, కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఖమ్మం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో కూడా అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఖమ్మం జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలో రూ.1,100 చెల్లించిన జర్నలిస్టులకు రశీదులు ఇచ్చి సభ్యుల లిస్టును బహిరంగంగా ప్రకటించాలన్నారు. స్తంభాద్రి హౌసింగ్ సొసైటీ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజశేఖర్, తేనె వెంకటేశ్వర్లు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సాతుపాటి రామయ్య, జక్కంపూడి కృష్ణ, బాలకృష్ణ, బోయినపల్లి అంజయ్య, మోహన్‌రావు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం రఘునాథపాలెం మండల శాఖ ఆధ్వర్యాన జరిగిన సమస్యల సేకరణ, మెంబర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ రఘునాథపాలెంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని, పీఆర్సీ ప్రకటించాలని, ఉపాధ్యాయులను భర్తీ చేసి వారికి మినిమం టైం స్కేల్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి గుర్రం కేశవరావు, వేమిశెట్టి మోహన్‌దాసు, ఉపేందర్‌రెడ్డి, నాగమల్లేశ్వరరావు చారి, జబ్బర్, రంగారావు, సైదుబాబు, కేజీబీవీ ప్రత్యేక అధికారి లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతరామయ్య సేవలు మరువలేనివి

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన మద్దినేని అనంతరామయ్య కాంగ్రెస్ పార్టీ, గ్రామాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని, ఆయన లేనిలోటు పార్టీకి తీరనిదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లగూడెం, సాతానిగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, దమ్మాలపాటి సత్యనారాయణ, నల్లమోతు లక్ష్మయ్య, రవి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, రెడబోతు గోపీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం..



గుంత అంచున నడిచి వెళ్తున్న స్థానికురాలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ధంసలాపురం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా ఉంది. నగరం నుంచి ధంసలాపురం ప్రాంతానికి వెళ్లేందుకు అగ్రహారం గేటు వద్ద గత మూడేళ్ల క్రితం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం కొత్తూరు వైపు గుంత తవ్వి శంకుస్థాపన చేశారు. అయితే బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే ఆపేయడంతో ఇటీవల కురిసిన వర్షాలతో గుంత నీటితో నిండి చెరువును తలపిస్తోంది. ఇక గుంత పక్కన రోడ్డు నడిచేందుకు వీలు లేకుండా బురదమయంగా మారడంతో గుంతకు ఆనుకొని ఉన్న మట్టి గడ్డపై స్థానికులు నడుస్తుండగా.. ఎక్కడ అందులో జారిపడతారో అనే భయం కలుగుతుంది. ఎటువంటి ప్రమాదం జరగక ముందే అధికార యంత్రాంగం, పాలకులు పట్టించుకుని ఇక్కడ జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

స్కేటింగ్‌లో 'సర్వజ్ఞ' విద్యార్థిని సత్తా



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ నాగేంద్రకుమార్

ఖమ్మం సహకార నగర్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో తమ విద్యార్థిని ఎ.నివేదికసోషిని సిల్వర్, బ్రాంజ్ పతకాలు గెలుచుకుందని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంలో గల ఏజీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి క్రీడా పోటీలు మంగళవారం నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలికలకు నిర్వహించగా.. ఇందులో పెదవెంకటగిరి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అదే విధంగా వాలీబాల్ పోటీల్లో హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. అలాగే బాలుర విభాగంలో ఖోఖో పోటీల్లో పెదవెంకటగిరి, కబడ్డీలో జలగంనగర్ మైనార్టీ పాఠశాల విద్యార్థులు, వాలీబాల్ పోటీల్లో హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్ పాఠశాల విద్యార్థులు గెలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఏజీహెచ్ కార్యదర్శి కుమారిలు బహుమతులను అందించారు.

చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: క్రైస్తవులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పాలేరు నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ సొసైటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన కొంతమంది గణేశ్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన యూట్యూబర్లతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిందువులు-క్రైస్తవుల మధ్య విభేదాలు సృష్టించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బీ.వీ.రత్నం, కార్యదర్శి శ్యామ్యూల్ ఫిన్ని పాల్గొన్నారు.

టీజేఎస్ సభ్యత్వ నమోదు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ జన సమితి(టీజేఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఖమ్మంలో పార్టీ జిల్లా కన్వీనర్ వి.బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ నాయకత్వంలో తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జంగిపల్లి రవి, షేక్ సర్దార్, ఎల్.నరసింహారావు, మోహన్, నాగేశ్వరరావు, కిషోర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు మేమున్నాం..



ఖమ్మం సహకారనగర్: పుస్తకాలు, సామగ్రి అందిస్తున్న క్రియేటివ్ పాఠశాల యాజమాన్యం

☞ ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని వెంకటేశ్వనగర్, రూరల్ మండలం వాల్యాతండా వరద బాధితులు 112 మందికి మేడ్చల్ మల్కాజ్‌గిరి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన సమకూర్చిన నిత్యావసర సరుకులు, వంట సామగ్రిని ఖమ్మం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన మంగళవారం అందజేశారు.

☞ ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో నోట్ బుక్స్ కోల్పోయిన విద్యార్థులకు సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

☞ ఖమ్మం సహకారనగర్: వరద ముంపునకు గురై నష్టపోయిన నగరంలోని క్రియేటివ్ హైస్కూల్ పాఠశాల విద్యార్థులు, సిబ్బందికి క్రియేటివ్ పాఠశాల కరస్పాండెంట్ బిజ్జాల కమలాకర్, డైరెక్టర్ కౌశిక్‌లు రూ.1.20 లక్షల విలువ చేసే పుస్తకాలు, సామగ్రిని అందించారు. అలాగే నగరంలోని రామకృష్ణా విద్యాలయంలో మంగళవారం మున్నేరు వరద బాధితుల సహాయార్థం హైదరాబాద్ రామకృష్ణ మఠం, వివేహ ఖమ్మం, పూర్వ విద్యార్థుల సహకారంతో 400 మంది బాధితులకు 25 కేజీల బియ్యం, స్టీల్ పాత్రలు, ప్లాస్టిక్ బకెట్లు, ఒక నెలకు సరిపడా నిత్యావసరాల కిట్లు అందించారు.

సేవలతోనే గుర్తింపు

తిరుమలాయపాలెం: ప్రజలకు చేసిన మంచి సేవలే ఉద్యోగులకు గుర్తింపు తెస్తాయని మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి అన్నారు. మంగళవారం బదిలీపై వెళ్లిన తిరుమలాయపాలెం పంచాయతీ కార్యదర్శి సునీతకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సన్మాన సభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు పల్లె ప్రగతి కార్యక్రమాలను సజావుగా నిర్వహించి జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. అనంతరం కార్యదర్శిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు జక్కుల రాజేష్, గొలుసు ఉపేందర్, కొమ్ము వీరబాబు, చిరంజీవి, కొండలు, బొడ్డుపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ చట్టాన్ని రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంరూరల్: రవాణా రంగ కార్మికుల సంక్షేమ చట్టాన్ని రూపొందించి, ప్రభుత్వాలు వారికి అండగా నిలవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో జరిగిన ఏఐటీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులు సాధించడంలో ఏఐటీయూసీ కాలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కానీ ప్రభుత్వాలు చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మిక వర్గాన్ని కష్టాల పాలు చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై జీఎస్టీ విధించడం ద్వారా వాటి ధరలు కొంతవరకు తగ్గాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించి, రవాణా రంగ కార్మికులను అన్నిరకాలుగా ఆదుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మికంటి చినవెంకటరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి, సురేందర్, నవీన్, ఏ.సతీష్, మహేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ శాఖ సబ్సిడీ యూనిట్ ప్రారంభం

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడులో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన 100 శాతం సబ్సిడీపై మంజూరైన రూ.50వేల యూనిట్‌ను మంగళవారం మండల ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, యూనిట్‌ను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సూర్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిగుళ్ల శ్రీనివాస్, లబ్ధిదారుడు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలను శుభ్రం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంరాపర్తినగర్: కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల(అటానమస్) ఆధ్వర్యాన..



ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బహుమతి అందిస్తున్న దృశ్యం